Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# జీవరాశికి ముప్పు

www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)

ప్రపంచవ్యాప్తంగా మానవుల విధ్వంసకర చర్యల వల్ల జీవరాశులకు ప్రమాదం ఏర్పడిందనీ, తద్వారా అంతిమంగా మానవాళికి కూడా ముప్పేనని 'ప్రపంచ మూల్యాంకన నివేదిక' చేసిన హెచ్చరికను తక్షణం తీవ్రంగా పరిగణించవలసి ఉన్నది. భూమిపై ఉన్న సుమారు ఎనభై లక్షల జంతు, వృక్ష, సూక్ష్మ జీవరాసులలో పది లక్షలు 'కొన్ని దశాబ్దాల'లోనే అంతరించిపోయే ప్రమాదం ఏర్పడ్డది. ఈ అంతరిస్తున్న జీవాలలో బెంగాల్ టైగర్ కూడా ఉన్నది. గత కోటి సంవత్సరాలలో సగటున జీవరాసులు అంతరించిన దానికన్నా వందల రెట్లు వేగంగా జీవజాతులు నశించిపోతున్నాయి. తద్వారా మానవుల మనుగడకు కూడా ప్రమాదం ఏర్పడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా జీవ వైవిధ్యానికి, పర్యావరణానికి ఎటువంటి హాని జరుగుతున్నదో పరిశీలించి, అంచనావేయడానికి యాభై దేశాలకు చెందిన 145 మంది పరిశోధకులు సమిష్టి కృషి సాగించిన ఫలితమే ఈ ప్రపంచ మూల్యాంకన నివేదిక. 'జీవవైవిధ్య, పర్యావరణ సేవల అంతర్‌ప్రభుత్వ విజ్ఞానశాస్త్ర విధాన వేదిక' ఆధ్వర్యంలో సోమవారం ప్యారిస్‌లో ఈ సంక్షిప్త నివేదిక విడుదలైంది. ఈ సందర్భంగా పరిశోధకులు వెల్లడించిన అభిప్రాయాలు కూడా విధ్వంసకర అభివృద్ధి విధానాల ప్రమాదాన్ని వివరించాయి. విధ్వంసకర ఆర్థిక విధానాల వల్ల వాతావరణ మార్పు, జీవరాశికి ప్రమాదం మొదలైనవి మనకు ఇప్పటికే అవగాహనకు వచ్చిన విషయాలే. అయితే ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలోని పరిస్థితులను సూక్ష్మస్థాయిలో వెల్లడించే పదిహేను వేల పరిశోధనా పత్రాలను మూడేండ్ల పాటు అధ్యయనం చేసిన మీదట తయారుచేసిన నివేదిక కనుక దీనికి ప్రాధాన్యం ఏర్పడ్డది. మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడిన నేపథ్యంలో ఇటువంటి బృహత్ పరిశోధన అవసరమైంది.

**జీవరాసులు అంతరించిపోయే ఈ పరిస్థితికి మన పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే ప్రధాన కారణం. శిలాజ ఇంధనాలను మండించడం, పారిశ్రామిక స్థాయి వ్యవసాయం, మితిమీరిన చేపల వేట, అడ్డగోలుగా గనులను తవ్వడం, చెట్లను నరకడం జీవజాతులు విధ్వంసానికి గల ప్రధాన కారణాలు. జీవుల మనుగడకు భరోసా ఇచ్చే తావులు ధ్వంసం కావడం వల్ల జీవరాశి అంతరిస్తున్నది. ఉదాహరణకు పగడాల దీవుల విధ్వంసం వల్ల దానిపై ఆధారపడే మత్స్య సంపద నశిస్తున్నది. ఒకరకం జీవులు అంతరిస్తే అవి ఆధారంగా బతికే ఇతర జీవులు నశిస్తాయి. మొక్కలు నశిస్తే వాటిపై ఆధారపడే జంతువులు నశిస్తాయి.**

జీవరాసులు అంతరించిపోయే ఈ పరిస్థితికి మన పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే ప్రధాన కారణం. శిలాజ ఇంధనాలను మండించడం, పారిశ్రామిక స్థాయి వ్యవసాయం, మితిమీరిన చేపల వేట, అడ్డగోలుగా గనులను తవ్వడం, చెట్లను నరకడం జీవజాతులు విధ్వంసానికి గల ప్రధాన కారణాలు. జీవుల మనుగడకు భరోసా ఇచ్చే తావులు ధ్వంసం కావడం వల్ల జీవరాశి అంతరిస్తున్నది. ఉదాహరణకు పగడాల దీవుల విధ్వంసం వల్ల దానిపై ఆధారపడే మత్స్య సంపద నశిస్తున్నది. ఒకరకం జీవులు అంతరిస్తే అవి ఆధారంగా బతికే ఇతర జీవులు నశిస్తాయి. మొక్కలు నశిస్తే వాటిపై ఆధారపడే జంతువులు నశిస్తాయి. ఇట్లా ఆహార గొలుసు దెబ్బతిని ప్రాణికోటి అంతరిస్తుంది. కీటకాలు అంతరించడ వల్ల జరిగే ప్రమాదం గమనార్హమైనది. ఈ కీటకాల వల్ల మొక్కల్లో పరాగ సంపర్కం జరుగుతుంది. పరాగసంపర్కం జరుగకపోతే పంటలు పండవు. ఆహారోత్పత్తి దెబ్బతిని మనుషులకూ ముప్పు ఏర్పడుతుంది. ప్రకృతిలోని జీవరాసులన్నీ పరస్పర అనుసంధానం కలిగి ఉంటాయి. మానవులు మాత్రమే భూమి పై బతుకడం సాధ్యం కాదు. ప్రకృతికి ఎక్కడైనా ముప్పు ఏర్పడితే దానికదే సర్దుబాటు చేసుకుంటుంది. అయితే ప్రకృతికి స్వీయ చికిత్స చేసుకునే సామర్థ్యాన్ని కూడా మానవులు తమ కార్యకలాపాల ద్వారా దెబ్బతీస్తున్నారని ఈ ప్రపంచ నివేదిక అధ్యక్షులలో ఒకరు, అర్జెంటీనాకు చెందిన పర్యావరణ వేత్త సాండ్రా డయాజ్ అభిప్రాయపడ్డారు. జీవ వైవిధ్యం మనందరి ఉమ్మడి వారసత్వ సంపద. ఇది మన జీవనానికి మద్దతునిస్తుంది. ఈ భద్రతా వల ఛిద్రమైపోతే మానవాళికి ప్రమాదం అని ఆమె హెచ్చరించారు.

సకల జీవరాసులలోకెల్లా మానవుడు అత్యంత అభివృద్ధి చెందిన జీవి. అందువల్ల మానవులకు మిగతా జీవరాసులను కాపాడే నైతిక బాధ్యత ఉంటుంది. కానీ ఉన్నవాటిని ధ్వంసం చేయడం చివరికి తన మనుగడకు తానే ముప్పు తెచ్చుకోవడం మూర్ఖత్వం. ప్రపంచ మూల్యాంకన నివేదికను అమెరికా, రష్యా, చైనాతో సహా 130 దేశాలు ఆమోదించడం వల్ల ఈ పరిస్థితిలో మార్పు వస్తుందేమోననే ఆశ పుడుతున్నది. ఈ నివేదిక ఒక ఆశాజనకమైన అంశాన్ని కూడా బోధించింది. జీవరాశికి తద్వారా మానవాళికి ముప్పు ఏర్పడిందనేది వాస్తవమే అయినా, ఇంకా మానవులు తలుచుకుంటే ఈ ప్రమాదాన్ని అధిగమించవచ్చునని ఈ నివేదిక వివరించింది. స్థానికం నుంచి ప్రపంచ స్థాయి వరకు అంతా కలిసికట్టుగా పూనుకోవాలె. బ్రిటిష్ పర్యావరణ శాస్త్రవేత్త రాబర్ట్ వాట్సన్ చెప్పిన ప్రకారం– ప్రకృతిని పరిరక్షించడం, పునరుద్ధరించడం సుస్థిర విధానాల ద్వారా సాధ్యమే. అయితే ఈ వినాశనానికి కారణమవుతున్న స్వార్థ శక్తులను ప్రజలు ఎదుర్కోవాలె. సాంకేతిక, ఆర్థిక, సామాజిక, రంగాలలో భారీ మార్పు రావాలె. మన వ్యవస్థలలో మార్పు తీసుకురావాలె. మన ఆలోచనలు, లక్ష్యాలు, విలువలు మొత్తంగా మారిపోవాలె అని వాట్సన్ సూచించారు. ప్రకృతిని ధ్వంసం చేసే జీవన సరళిని మార్చుకోవాలె. ఆర్థికాభివృద్ధి ప్రధానంగా సాగుతున్న ఇప్పుడున్న విధానాలను ప్రపంచ దేశాలు మార్చుకోవాలె. ఈ మార్పులను కూడా తక్షణం అమలుచేయాలె. జీవవైవిధ్యంపై అంతర్జాతీయ భారీ సమావేశం వచ్చే ఏడాది చైనాలో జరుగనున్నది. ఈలోగా ప్రపంచవ్యాప్తంగా విధానపరమైన మార్పులు తీసుకురావాలె.

www.freegurukul.org